
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 28 । మే । 2023



42.642 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శనివారానికి 42.642 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 181 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు(10 గ్రాములు) -	రూ.61,860
22 క్యారెట్లు ఆర్నమెంట్(గ్రా) -	రూ.5,555
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,722
సవర(8 గ్రా) -	రూ.45,776

గరిష్టం/కనిష్టం
42.1 /29.6

వాతావరణం

శనివారం గాలిలో తేమ 42 శాతం ఉంది. ఆదివారం ఉష్ణోగ్రతలు, ఉక్కపోత అధికంగా ఉంటాయి. వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

• కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో, సరోగసి క్లినిక్‌లలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీకి చైర్మన్ హోదాలో జిల్లాలో అమలవుతున్న చట్టాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ జిల్లాలోని ఏఆర్‌టీ క్లినిక్‌లు, ఏఆర్‌టీ బ్యాంక్‌లు, సరోగసి క్లినిక్‌లు, నూతన స్కాన్ సెంటర్ల రెన్యువల్, సవరణలకు సంబంధించి కమిటీలో నివేదించారు.

వైద్యఖర్చులకు రూ.11 లక్షల సాయం



నగదు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన షాహుల్ కుమారుడు మూడేళ్ల ఆష్రాఫ్‌కు వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.11 లక్షల ఎల్‌ఓసీని శనివారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్వర్ణ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

30న రైతుభరోసా నగదు

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ రైతుభరోసా నగదును ఈ నెల 30వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,14,636 మంది రైతు కుటుంబాలకు రూ.118 కోట్లు నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టాలకు సంబంధించి 1,456 మంది రైతులకు రూ.1.68 కోట్ల నగదు జమ చేయనున్నట్లు తెలిపారు.

30న ఆర్టీసీలో అవగాహన సదస్సు


నెల్లూరు సిటీ: జిల్లా పరిధిలోని వివిధ బస్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న స్థలాలను టెండర్ల ద్వారా కేటాయించేందుకు ఈ నెల 30వ తేదీన ఔత్సాహిక, పారిశ్రామికవేత్తలకు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పీవీ శేషయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, ఉలవపాడు బస్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న స్థలాలను 15 సంవత్సరాల ప్రాతిపదికన ఇచ్చేందుకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. టెండర్‌కు సంబంధించిన వివరాలు www. aprtc.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఆసక్తి గల పారిశ్రామికవేత్తలు 30వ తేదీ ఉదయం 11 గంటలకు జరిగే అవగాహన సదస్సుకు హాజరుకావాలని తెలిపారు.

విలువలకు పాతర

ఆ ముగ్గురి అపవిత్ర కలయిక

- మాటల తూటాలు పేల్చుకున్న వారే చేతులు కలిపారు
- గతం గతః అన్నట్లుగా వ్యవహరిస్తున్న వైనం
- ఛీదరించుకుంటున్న ఉదయగిరి వాసులు

బద్ధ శత్రువులుగా ఉండి ఉదయగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆ ముగ్గురు నేతలు ఇప్పుడు ఒక్కటైపోయారు. తమ రాజకీయ అవసరాల కోసం కలిసిపోయారు. వారే కంభం విజయరామిరెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి. దశాబ్దాలపాటు ఆదరించిన పార్టీకి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వెన్నుపోటు పొడిచి టీడీపీ నేతలతో చేతులు కలిపారు. నైతిక విలువలకు పాతరేసి ఆ ముగ్గురు నేతలూ ఏకం కావడంతో ప్రజల్లో పలచబడ్డారు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనేది నానుడి. కానీ ప్రస్తుత రాజకీయాల్లో నైతిక విలువలు లేకుండాపోయాయి. ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించిన, వహిస్తున్న కంభం విజయరామిరెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించారు. కంభం, బొల్లినేని ఒకే పార్టీలో ఉన్నప్పటికీ ఆ ఇద్దరూ ఎప్పుడూ ఒకే వేదికను పంచుకున్న దాఖలాలే లేవు. ఎవరికి వారు యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించారు. ఒకరిపై ఒకరు పార్టీ పెద్దల వద్ద పంచాయితీలు పెట్టుకున్న సందర్భాలు కోకొల్లలు. అయితే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి కంభం, బొల్లినేనితో బద్ధ వైరం ఉండేది. వీరిలో ఎవరైనా మేకపాటిని విమర్శిస్తే.. నియోజకవర్గంలోని అన్ని మండలాల నేతలతో ప్రెస్‌మీట్లు పెట్టించి మరీ తిట్టించారు. మేకపాటి బహిరంగ వేదికలపై బొల్లినేనిపై అవినీతి ఆరోపణలు చేయడమే కాకుండా తన క్యాడర్‌తోనూ చేయించారు. ఇక కంభంపై అయితే మేకపాటి గతంలోనే విమర్శలు, ఆరోపణలు చేశారు.

వైఎస్సార్ కుటుంబంతో ఎదిగి..

జిల్లాలో మేకపాటి కుటుంబానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అత్యంత ప్రాధాన్యం కల్పించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం వారికి అంతే ప్రాధాన్యం ఇచ్చారు. అయితే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి స్వార్థ రాజకీయాలు చేసి స్థాయిని దిగజార్చుకున్నారు. ఈ పరిణామాలు ముందుగానే గ్రహించిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన సోదరుడైనప్పటికీ చంద్రశేఖరరెడ్డిని దూరం పెట్టారు. నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు తెరతీసిన చంద్రశేఖర్‌రెడ్డి తన గ్రాఫ్ పడిపోవడంతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తనకు టికెట్ రాదనే అనుమానంతో రాజకీయ భిక్ష పెట్టిన పార్టీకి, ఆదరించిన ప్రజలను విస్మరించి టీడీపీతో చేతులు కలిపారు.

పార్టీ క్యాడర్ దూరం

రాజకీయ అవసరాల కోసం ఒకరికొకరు దూషించుకున్న చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, బొల్లినేని వెంకటరామారావు ఇప్పుడు ఒక వేదికపైకి రావడంతో వీరితో అంటకాగిన పార్టీ క్యాడర్ దూరంగా వెళ్లిపోతున్నారు. రాజకీయ విమర్శలు, అవినీతి ఆరోపణలు, భౌతికదాడులు చేసిన చంద్రశేఖర్‌రెడ్డితో ఎలా కలిసి పనిచేయాలని లోలోనే టీడీపీ క్యాడర్‌తోపాటు అధికారపార్టీ శ్రేణులు రగిలిపోతున్నాయి. ఈ పరిణామాలతో ప్రజల్లోనూ ఆ ముగ్గురు నేతలు పలచబారారు.

టీడీపీలో బీసీ వాదన

వైఎస్సార్‌సీపీ బీసీలకు ప్రాధాన్యం ఇచ్చేలా గత ఎన్నికల్లో జిల్లాలో ఒక ఎమ్మెల్యే టికెట్ కేటాయించింది. తర్వాత రాజ్యసభ టికెట్ బీసీలకు ఇచ్చింది.

అవసరం కోసం దిగజారి..

ఈ దఫా ఎన్నికల్లో పోటీపై ఆసక్తి చూపని బొల్లినేని గతంలోనే పార్టీ అధిష్టానానికి సంకేతం పంపారు. దీంతోపాటు పార్టీ అభ్యర్థిత్వం ఇప్పిస్తానంటూ ప్యాకేజీ మాట్లాడుకున్న ఇద్దరు నేతలను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వద్దకు తీసుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. కాని ఆ నేతలను చంద్రబాబు పెద్దగా పట్టించుకోలేదు. ఈ క్రమంలో చినబాబు లోకేశ్ కాకర్ల సురేష్‌ను రంగంలోకి దింపడంతో ఆయన టికెట్ నాదేనంటూ ప్రకటించుకుంటున్నారు. ఇప్పటికే టీడీపీలో టికెట్ల లొల్లి జరుగుతున్న క్రమంలో టికెట్ తనకిస్తే పోటీ చేస్తానంటూ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి రంగంలోకి దిగారు. నైతిక విలువలకు పాతరేసిన చంద్రశేఖర్‌రెడ్డి తనకు రాజకీయ శత్రువులుగా ఉన్న బొల్లినేని, కంభం ఇళ్లకు వెళ్లి వారి ఆశీస్సులు కోరారు.

కంభంతో కలిసి..

నిన్నటి వరకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న కంభం విజయరామిరెడ్డిని చంద్రశేఖర్‌రెడ్డి కలిసి గతం..గతః అంటూ తనకు ఆశీస్సులు కావాలని కాళ్లబేరానికి వెళ్లాడని, తన వల్ల ఏవిధంగా అయినా ఇబ్బందులు పడి ఉంటే క్షమించమని ప్రాధేయపడ్డాడని తెలిసింది. ఈ పరిణామాలను చూసి టీడీపీ శ్రేణులు నివ్వెరపోయారని సమాచారం.



ఇటీవల ఉదయగిరిలో టీడీపీ నేత మన్నేటి వెంకటరెడ్డి నివాసంలో సమావేశమైన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, కంభం విజయరామిరెడ్డి

కానీ టీడీపీ మాత్రం బీసీలను ఉపయోగించుకోవడమే తప్ప వారికి పదవులు ఇవ్వడం లేదనే వాదన ఉంది. తాజాగా ఉదయగిరిలో బీసీ నేతగా ఉన్న చెంచలబాబు యాదవ్ టీడీపీ టికెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే టికెట్ తమకే ఇవ్వాలని ఆయన పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. వలస నేతల రాకతో టీడీపీలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచిచూడాల్సిందే.

సత్ఫలితాలనిస్తున్న 'మొబైల్ హంట్'

• 212 మొబైల్స్ రికవరీ



బాధితురాలికి ఫోన్ అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'మొబైల్ హంట్' విధానంతో సత్ఫలితాలొస్తున్నాయని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న రూ.50 లక్షల విలువ చేసే 212 మొబైల్స్‌ను పోలీసు అధికారులు రికవరీ చేశారు. రికవరీ చేసిన ఫోన్లను శనివారం ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ చేతులమీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందించాలన్న సంకల్పంతో మొబైల్ హంట్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కేవలం 9154305600 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ ద్వారా జిల్లాలో చోరీ అయిన సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం అతి తక్కువ సమయంలోనే రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.90 లక్షల విలువ చేసే 416 మొబైల్స్‌ను బాధితులకు అందించామన్నారు. మిగిలిన ఫోన్లను త్వరలో రికవరీ చేస్తామని, మొబైల్ హంట్ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, డీటీసీ డీఎస్పీ ఎస్.శిరీష, సైబర్ క్రైమ్ ఎస్సై సురేష్, ఆర్ఎస్సై సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రైతులకు ప్రోత్సాహం ఇస్తోంది. ఇప్పటికే రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం, తాజాగా పంటల సాగుకు అవసరమైన ట్రాక్టర్లతోపాటు వివిధ వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీతో అందిస్తూ తోడ్పాటునిస్తోంది. ప్రతి విషయంలో పారదర్శకంగా ఉంటూ రైతులకు అండగా నిలుస్తోంది.

- ఇప్పటికే 402 గ్రూపులకు యాంత్రీకరణ పరికరాలు
- రైతుల ఖాతాల్లో రూ.13.43 కోట్లు సబ్సిడీ నగదు జమ
- తాజాగా మరో 213 గ్రూపులకు..

నెల్లూరు(సెంట్రల్): రైతుల సంక్షేమమే లక్ష్యంగా పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంలో యాంత్రీకరణపై దృష్టి సారించి దానిని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలోని 561 రైతుభరోసా కేంద్రాలు ఉండగా, వీటి పరిధిలో ఉన్న రైతులు ఐదుమంది సభ్యులుగా ఏర్పడి కస్టం హైరింగ్ సెంటర్ల పేరుతో గ్రూపులుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ విధంగా ఇప్పటికే జిల్లాలో 402 గ్రూపులు ఏర్పాటు కాగా ప్రభుత్వం ఆ గ్రూపులకు యాంత్రీకరణ పరికరాలను అందజేసింది.



వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న అధికారులు(ఫైల్)

యాంత్రీకరణ పరికరాలు అందుకున్న గ్రూపులకు సంబంధించి రూ.13.43 కోట్ల సబ్సిడీ నగదు కూడా ఆయా గ్రూపుల సభ్యుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. జిల్లాలో తాజాగా మరో 213 గ్రూపులను వ్యవసాయశాఖ అధికారులు ఎంపిక చేసి పూర్తి వివరాలను ప్రభుత్వానికి పంపారు. ఈ సభ్యులకు సంబంధించి రూ.6.7 కోట్ల సబ్సిడీ నగదు కూడా త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ కానుంది. ప్రభుత్వం అందజేసిన యాంత్రీకరణ పరికరాలను రైతులు వ్యవసాయ పనుల్లో వినియోగించుకుంటున్నారు.

రైతులకు ఎంతో ఉపయోగకరం

ప్రస్తుతం జిల్లాలో యాంత్రీకరణ పరికరాలను పంపిణీ చేస్తున్న గ్రూపులకు సంబంధించి ట్రాక్టర్లు, ఇతర పరికరాల కొనుగోలుకు 40 శాతం సబ్సిడీని ప్రభుత్వం ఇవ్వగా, 50 శాతం బ్యాంక్ రుణం, 10 శాతం మాత్రమే గ్రూపులోని లబ్ధిదారులు పెట్టుకుని యాంత్రీకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా రైతులకు సంబంధించి 177 రకాల వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను వారే ఎంపిక చేసుకునేలా ప్రభుత్వం చాయిస్ ఇవ్వడంతో నచ్చిన పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. అదే విధంగా రూ.15 లక్షల విలువ చేసే యాంత్రీకరణ పరికరాలు కొనుగోలు చేసుకునే వీలును కూడా ప్రభుత్వం కల్పించింది. దీంతో ఈ పథకం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు అన్నదాతలు చెబుతున్నారు.

సబ్సిడీ, రుణం ఇస్తున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయానికి సంబంధించి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రస్తుతం సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు ఇస్తోంది. ప్రధానంగా సబ్సిడీ, రుణం కల్పించి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

– ఆర్.గోపాల్‌రెడ్డి, రైతు, డీసీపల్లి

అర్హులకు పంపిణీ



యాంత్రీకరణ పరికరాల పంపిణీకి సంబంధించి ఎక్కడా ప్రలోభాలకు, సిఫార్సులకు తావులేకుండా చేస్తున్నాం. రైతులు ఏర్పాటు చేసుకున్న గ్రూపుల పరిస్థితిని పరిశీలించి తరువాతే అర్హులైన అన్నదాతలకు పంపిణీ చేస్తున్నాం.

– అనిత, ఏడీ, వ్యవసాయశాఖ

జగనన్న పాలనకు నూరు శాతం మార్కులు

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు రాష్ట్ర ప్రజలు నూటికి నూరు శాతం మార్కులు వేస్తూ తమ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సర్వేపల్లిలో రెండో రోజు శనివారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మంత్రి మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సర్వేపల్లి నియోజకవర్గంలో పూర్తి చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సర్వేపల్లిలో నిర్వహించే బహిరంగసభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు.

చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన ఖర్మ

గతంలో ప్రజలను అన్నివిధాలుగా మోసం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్రానికి పట్టిన ఖర్మ అని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలు కోరుకునే విధంగా పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కాదని చంద్రబాబుకు ఎందుకు ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. తొలుత రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.5 లక్షలతో అభివృద్ధి చేసిన శ్మశానవాటికను మంత్రి ప్రారంభించారు. వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, టి.చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, జగదీష్‌రెడ్డి,కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు.. ఇద్దరి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



మృతిచెందిన డ్రైవర్ సురేష్

• మరో ముగ్గురికి తీవ్రగాయాలు

కావలి రూరల్: ముందువెళ్తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందగా మరో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం కావలిరూరల్‌లోని గౌరవరం వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై ఎం.వెంకటరావు తెలిపిన వివరాల మేరకు నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్ కాలనీకి చెందిన అనంతరాజు లక్ష్మీనారాయణ(65), అతని భార్య ఆదిలక్ష్మి, మోక్షగుండం అనుపమ, నాగమణి, డ్రైవర్ సురేష్(60) మొత్తం ఐదుగురు ప్రకాశం జిల్లాలోని మాలకొండకు దైవదర్శనానికి వెళ్లి తిరిగి నెల్లూరుకు వస్తున్నారు. మార్గమధ్యంలో కావలిరూరల్‌లోని గౌరవరం వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని కారు బలంగా ఢీకొంది. స్థానికులు వెంటనే లక్ష్మీనారాయణ, నాగమణిలను చికిత్సనిమిత్తం నెల్లూరుకు తరలించగా ఆస్పత్రిలో వైద్యం పొందుతూ లక్ష్మీనారాయణ మృతిచెందారు. అనంతరాజు ఆదిలక్ష్మి, మోక్షగుండం అనుపమ, డ్రైవర్ సురేష్‌లను చికిత్సనిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా డ్రైవర్ సురేష్ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి కొళాయిల ఏర్పాటుపై శ్రద్ధ చూపాలి

- నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టండి
- కలెక్టర్ ఎం.హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ

నెల్లూరు(దర్గామిట్ట): జలజీవన్ మిషన్ కింద జిల్లాలో జరుగుతున్న తాగునీటి పనులకు సంబంధించి ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిని ఏర్పాటు చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జలజీవన్ మిషన్, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీరంగవరప్రసాద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద గ్రామాల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ పథకం కింద మంజూరైన రూ.5 లక్షల లోపు పనులను త్వరగా మొదలు పెట్టి పూర్తి చేయాలని సూచించారు. రూ.5 లక్షల పైబడిన పనులకు 2 వారాల్లోపు టెండర్లు పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ కూడా వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. సచివాలయాలకు అనుబంధంగా నిర్మిస్తున్న సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాల పనులు వేగవంతం చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చుక్కల భూముల పత్రాల పంపిణీకి చర్యలు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో చుక్కల భూముల హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తన చాంబర్‌లో జేసీ కూర్మనాథ్‌తో కలిసి ఆర్డీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ఆర్డీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, ఆర్డీఓలు మలోల, కరుణకుమారి, శీనానాయక్ పాల్గొన్నారు.

కారు ఢీకొని కొరియర్ బాయ్ మృతి



శంషుద్దీన్ మృతదేహం

వరికుంటపాడు: ఓ పార్శిల్‌ను డెలివరీ చేసేందుకు వచ్చిన కొరియర్ బాయ్ ను ఓ కారు వేగంగా ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన శంషుద్దీన్(30) కొరియర్ ఇచ్చేందుకు వరికుంటపాడుకు వచ్చాడు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద ఆగి కస్టమర్‌కు ఫోన్ చేస్తుండగా దుత్తలూరు వైపు నుంచి పామూరు వెళ్తున్న గుర్తుతెలియని కారు వేగంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పామూరుకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఎస్సై విజయ్‌శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని..



వీరాస్వామి మృతదేహం

మనుబోలు : ఇద్దరు వ్యక్తులు మోటార్ బైక్‌పై రోడ్డు దాటుతుండగా ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా కోట మండలం తిన్నెలపూడి పంచాయతీ చెంబడిపాళెం గ్రామానికి చెందిన కట్టా వీరాస్వామి(45) పొలాల్లో బోర్లు వేస్తూ జీవనం సాగిస్తాడు. మనుబోలు మండలంలోని బద్దెవోలు గ్రామంలో బోరు వేసేందుకు తన సహచరుడు కొల్లు సునీల్‌కుమార్‌తో కలిసి బైక్‌పై బద్దెవోలు బయలుదేరాడు. హైవేపై బద్దెవోలు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరాస్వామి అక్కడికక్కడే మృతిచెందగా సునీల్‌కుమార్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సునీల్‌కుమార్‌ను హైవే అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూన్ నుంచి పొగాకు సూర కొనుగోళ్లు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో జూన్ 1వ తేదీ నుంచి పొగాకు సూర కొనుగోళ్లు ప్రారంభిస్తామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ శనివారం తెలిపారు. జూన్ 1న మర్రిపాడు, తిక్కవరం, పొంగూరు, దుత్తలూరు, ఆదూరుపల్లి క్లస్టర్ గ్రామాల రైతులు, 2న డీసీపల్లి, గుండెమడగల, నెల్లూరుపాళెం క్లస్టర్ గ్రామాల రైతులు తమ పొగాకు సూర ఉత్పత్తులను వేలం కేంద్రంలో అమ్ముకోవచ్చన్నారు. ఒక్కో బేలు తూకం 150 కేజీలు మించకుండా వేలం కేంద్రానికి తీసుకురావాలన్నారు. పొగాకు బోర్డు అనుమతించిన అమ్మకపు కోటాతో సంబంధం లేకుండా అదనంగా సూర కొనుగోలుకు ఉన్నతాధికారులు అనుమతించారని తెలిపారు. రైతులు తమ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద అమ్మకపు వివరాలు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

480 బేళ్ల కొనుగోలు

వేలం కేంద్రంలో శనివారం పొంగూరు క్లస్టర్ రైతులు 512 బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా, 480 బేళ్లను 12 కంపెనీల బయ్యర్లు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి తెలిపారు. వివిధ కారణాలు వల్ల 32 బేళ్లు వేలం నుంచి తిరస్కరించామన్నారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.181 నమోదైందన్నారు. పొంగూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 59 వేల కిలోల పొగాకును వేలం కేంద్రానికి తీసుకురాగా, రూ.కోటి, 18 లక్షల పైచీలుకు ధరతో కొనుగోలు చేశామని తెలిపారు.

కలిగిరిలో 530 బేళ్ల కొనుగోలు

కలిగిరి : కలిగిరి వేలం కేంద్రంలో శనివారం 530 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 581 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 530 బేళ్లను కొనుగోలు చేశారని, 51 బేళ్లను తిరస్కరించారని వివరించారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.165, సగటున రూ.199.52 ధర లభించింది. వేలంలో 11 కంపెనీలు పాల్గొన్నాయి.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:155
లేయర్ (లైవ్)	:98
బ్రాయిలర్ చికెన్	:262
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:292
లేయర్ చికెన్	:167

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	:రూ.52
సన్నవి	:రూ.20
పండ్లు	:రూ.15

ఇంటర్ పరీక్షలకు 650 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి శనివారం 650 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షలకు 13,727 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 13,256 మంది హాజరయ్యారు. 471 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 326 మందికి గానూ 294 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షల్లో జనరల్‌కు సంబంధించి 2,661 మందికి గానూ 2,540 మంది హాజరు కాగా 121 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 176కు 152 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

నెల్లూరు (టౌన్) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆర్ఐఓ వరప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సంస్కృతం సబ్జెక్టుకు సంబంధించి మూల్యాంకనం జరుగుతుందన్నారు. ప్రతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తమ కాలేజీలో పనిచేస్తున్న అధ్యాపకులను మూల్యాంకనానికి పంపించాలన్నారు.

సండే క్లాసిఫైడ్స్ — సాక్షి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.